

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

గురువారం,12 మార్చి 2026 | 8 పేజీలు


## ఆత్రేయపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో...

# అవినీతి అరాచకం

- ప్రభుత్వ ఆశయాలు గాలికి.. అధికారుల జేబులు నిండుగా!
- సొమ్ములు ఇస్తే ఎలాంటి రిజిస్ట్రేషన్ అయినా చేసేస్తాం
- పట్టించుకోని జిల్లా అధికారులు- ఇన్చార్జి రిజిస్టర్ పాలనలో అంతా కలెక్షన్లే





**ఉమ్మడిగోదావరిజిల్లాల సూర్యబ్యూరో :** ఆత్రేయపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంఇప్పుడు అవినీతికి అడ్డాగా మారింది. సామాన్యుడి సొమ్ము కనిపిస్తే చాలు, నిబంధనల పుస్తకానికి తాళం పడుతోంది. 'సొమ్ములు ఇస్తేచాలు..ఎలాంటి రిజిస్ట్రేషన్‌అయినాఇక్కడి స్పెషా లిటీ'అంటూబాహాటంగానేవిమర్శలు వినిపిస్తున్నాయి.

**వారసులున్నా .. సంతకాలు అవసరం లేదు!**
**రిజిస్ట్రేషన్ చేసేస్తా!**

ఇటీవల ఈ నెల 7వ తేదీన జరిగిన ఒక ఉదాహరణ చూస్తే ఇక్కడి అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది. ఒక నిరుపేద కుటుంబానికి చెందిన ఆస్తిని, అసలైన వారసుల సంతకాలు లేకుండానే, కేవలం దళారుల అండతో రిజిస్ట్రేషన్ చేసేశారు. బాధితులు తమఆస్తిని కాపాడుకోవడానికి అధికారుల చుట్టూ తిరుగుతున్నా, ఇంచార్జ్ రిజిస్ట్రార్ కసింకోట శ్రీనివాసరావు మాత్రం 'డోంట్‌కేర్' అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

**రేట్ కార్డు సిద్ధం.. లంచం ఇస్తేనే ఫైలు కదలిక!**

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో ఎన్ని సంస్కరణలు తెచ్చినా, ఆత్రేయపురంలో మాత్రం 'పాత పద్ధతే' రాజ్యమేలుతోంది.

**దళారీ వ్యవస్థ:** కార్యాలయంలోకి అనధికార వ్యక్తులు రాకూడదన్న నిబంధన ఉన్నా, ఇక్కడ మాత్రం లేఖర్లు, దళారీలే అంతా నడిపిస్తున్నారు.

**వేధింపులు:** అడిగినంత ఇచ్చుకోకపోతే ఏదో ఒక కొర్రీపెట్టిసామాన్యులనుముప్పతిప్పలు పెడుతున్నారు. గతంలో ఈ అధికారిపై అనేక విచారణలు జరిగినా, తీరు మారకపోవడం గమనార్హం.

**బాధితుల హెచ్చరిక:**
**న్యాయం జరగకపోతే దీక్షే శరణ్యం!**

అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్‌పై ఉన్నతాధికారులు తక్షణం విచారణ జరిపించాలని

- తరువాయి 2లో..

## స్వర్ణాంధ్ర @ 2047 లక్ష్యంగా

# అడుగులు

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్ల భాగస్వామ్యం..
- అభివృద్ధి పథంలో గోదావరి జిల్లాలకు అగ్రతాంబూలం







**రాజమహేంద్రవరం/కాకినాడ/అమలాపురం, సూర్యబ్యూరో :**రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం మరియు సుపరిపాలనలో సమతుల్యత సాధించడమే లక్ష్యంగా వెలగపూడి సచివాలయంలో నిర్వహిస్తున్న 6వ జిల్లా కలెక్టర్ల సమావేశం బుధవారం అత్యంత కీలకంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈభేటీలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి,కాకినాడ జిల్లా కలెక్టర్ షన్ మోహన్ మరియు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ చురుగ్గా పాల్గొన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించి 'స్వర్ణాంధ్ర 2047' విజన్ డాక్యుమెంట్‌పై సీఎంజిల్లా కలెక్టర్లకు స్పష్టమైన కార్యాచరణను అందించారు.

**గోదావరి జిల్లాల అభివృద్ధిపై ప్రత్యేక ఫోకస్:**

సమావేశంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన సాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనపై కీలక చర్చ జరిగింది.

**- వ్యవసాయం:** మే 15 నుంచే ఖరీఫ్ సాగు నీటిని విడుదల చేస్తామని సీఎం ప్రకటించడంతో, గోదావరి డెల్టా రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కోనసీమ కలెక్టర్ మహేష్ కుమార్ జిల్లాలోని ఆక్వా మరియు కొబ్బరి సాగు అభివృద్ధిపై నివేదించగా, తూర్పుగోదావరి కలెక్టర్ కీర్తిచేకూరి అన్నదాత సుఖీభవ నిధుల జమపై సంసిద్ధతను వ్యక్తపరిచారు.

**పారిశ్రామికం &పోర్టులు:** కాకినాడ పోర్టు అభివృద్ధి మరియు పారిశ్రామిక కారిడార్ల పురోగతిపై కాకినాడ కలెక్టర్ షన్ మోహన్ ముఖ్యమంత్రికి వివరించారు.

**సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు:**

**అన్నదాత సుఖీభవ:**

మార్చి 13న మూడో విడత నిధుల విడుదల. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' ఏర్పాటు.

**ప్రజా సంక్షేమం:** ఉగాది పర్వదినాన రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మందికి సామూహిక గృహ ప్రవేశాలు.

**విద్యుత్‌ఊరట:** ట్రూ డౌన్

- తరువాయి 2లో..

# ఎల్పీజీ సరఫరాపై నిరంతర నిఘా

- గ్యాస్ వినియోగదారులు కలత చెందవద్దు!
- అసత్య ప్రచారాలు నమ్మవద్దు:
జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్
- పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు..
నంబర్ 8886903611

**సూర్య బ్యూరో - ఉమ్మడి గోదావరి జిల్లాలు :**

ఇరాన్–ఇజ్రాయెల్‌దేశాల మధ్య యుద్ధం కారణంగా గ్యాస్ నిల్వలు తగ్గి,ధరలు పెరగనున్నాయని జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. జిల్లాలోని వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా ఎల్పీజీ నిల్వలు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులు, ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, వివిధ గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

గ్యాస్ సరఫరాపై ఏ విధమైన సందేహాలున్నా నివృత్తి





చేసుకునేందుకు జిల్లా పౌర సరఫరాల సంస్థ కార్యాలయం, కాకినాడ నందు ప్రత్యేకంగా కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు జేసీ తెలిపారు. డొమెస్టిక్ (14.2కేజీ)గ్యాస్‌వినియోగదారులు 8886903611 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం తెలుసుకోవచ్చ న్నారు.జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టళ్ళు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకుఎటువంటి ఇబ్బంది లేకుండా గ్యాస్ పంపిణీ జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

**అదనపు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు**

వినియోగదారులు గ్యాస్ రీఫిల్ బిల్లు ధర మాత్రమే చెల్లించాలని, డెలివరీ సిబ్బందికి ఎలాంటి అదనపు రుసుములు ఇవ్వనవసరం లేదని జేసీ తెలిపారు. ఎవరైనా ఎక్కువ మొత్తం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో రోజుకు సుమారు 11,000 సిలిండర్ల వినియోగం ఉంటుందని అంచనా వేసి, ఆ మేరకు నిల్వలు అందుబాటులో ఉంచాలని ఏజెన్సీలను ఆదేశించారు.

**అక్రమ నిల్వలపై క్రిమినల్ కేసులు**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్యఅవసరాలకు ఉపయోగిస్తే నిత్యావసర సరుకుల చట్టం,1955 ప్రకారం చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు.కృత్రిమ కొరత సృష్టించి అక్రమ నిల్వలు చేసే ఏజెన్సీలపై క్రిమినల్ చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్.ఎస్.ఎస్.రాజు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆత్రేయపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో... అవినీతి అరాచకం

**మొదటిపేజీ తరువాయి**

బాధితులు డిమాండ్ చేస్తున్నారు.లేనిపక్షంలో కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి, ఆత్రేయపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆత్రేయపురం సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ల అవా కొనసాగుతూనే ఉంది నిబంధనలకు విరుద్ధంగా క్రయవిక్రయాలనుండి ఇబ్బడి ముబ్బడిగా డబ్బులు వసూలు చేస్తున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ కసింకోట శ్రీనివాసరావు వసూలు చేస్తున్నట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ క్రయ విక్రయాలకు సంబంధించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణలు చేపట్టిన ఫలితం కనిపించడం లేదు. దళారి వ్యవస్థను నియంత్రించేందుకు ఉద్దేశించిన ఆన్‌లైన్ సేవలను ఆ శాఖ ఉద్యోగులే పక్కదారి పట్టిస్తున్నారు. ఎన్ని నిబంధనలు పెట్టిన ముడుపులు చెల్లించనిదే ఏ పని జరగని పరిస్థితి నెలకొంది. ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించుకుని దాని ప్రకారం చెల్లిస్తేనే పనిచేస్తున్నారు. లేదంటే ఏదో ఒక సాకు చూపించి విసుగు పుట్టేటట్లు అటూ ఇటూ తిప్పుతున్నారు. చేసేది ఏమీ లేక అడిగింది ఇచ్చి పని చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నిండా మునిగిన వాడికి ఎలాంటి చలి ఉండదన్న చందంగా ఆ శాఖలో పనిచేస్తున్న ఇన్చార్జి సబరిజిస్టర్ శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారని అందరూ చెబుతున్నారు. హద్దులు దాటుతున్న అవినీతిపై ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నా డోంట్ కేర్ అంటూ ముందుకు సాగిపోతున్నారు. ఉదాహరణకు ఈనెల 7న ఆత్రేయపురం గ్రామానికి చెందిన ఒక నిరుపేద కుటుంబానికి సంబంధించి రిజిస్ట్రేషన్ ఒకటి నిబంధనలకు విరుద్ధంగా చేసేశారు. వారసులు ఉన్నా వారి సంతకాలు, అనుమతులు ఏమీ లేకుండా ఒక దళారి ఆధ్వర్యంలో ఒక రిజిస్ట్రేషన్ అక్రమంగా చేసేశారు. ఇదేమిటని అడిగితే నీళ్లు నలుముతున్నారు. విషయం తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ముఖ్యంగా సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో డాక్యుమెంట్ రైటర్లు అనధికార వ్యక్తులను అనుమతించొద్దని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వీటిని ఆత్రేయపురం సబ్ రిజిస్టర్ కార్యాలయ ఇంచార్జ్ రిజిస్టర్ శ్రీనివాసరావు వీటిని అమలు చేయడం లేదు. వసూళ్ల పర్వం కొనసాగుతూనే ఉందన్న ఆరోపణలు బాహాటంగా వినిపిస్తున్నాయి. నియమ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఎలాంటి రిజిస్ట్రేషన్ అయినా చేసేస్తారు. గతంలో కూడా ఈయనపై పలు అవినీతి ఆరోపణలు రావడం, విచారణ జరగడం కూడా జరిగింది. అయినా సరే ఆయన పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదు. ఇక్కడ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తులు లేఖర్లు దళారీ పాత్ర పోషించడం గమనార్హం.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆత్రేయపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరిగే అవినీతి అక్రమాలపై నిగా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో సామాన్య మధ్య తరగతి ప్రజలు తమ విలువైన ఆస్తులను కోల్పోవాల్సి వస్తుందంటున్నారు. ముఖ్యంగా ఈనెల ఏడో తారీఖున జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌పై పూర్తి విచారణ నిర్వహించి బాధ్యత కుటుంబానికి తగు న్యాయం చేయవలసిందిగా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు బాధ్యత కుటుంబ సభ్యులు తెలిపారు.

# ‘పశ్చిమ’ రాజకీయాల్లో కావూరు ముద్ర

**కామవరపుకోట,మేజర్‌న్యూస్ :** దివంగతులైన కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నేత కావూరు సాంబశివరావు పదేళ్ల పాటు ఏలూరు ఎంపీగా, రెండేళ్ల పాటు కేంద్ర మంత్రిగా ఏలూరు జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనే ఆయన రాజకీయ ధురంధరుడిగా పేరొందారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఎదిగారు. కావూరు మచిలీపట్నం నుంచి మూడుసార్లు, ఏలూరు నుంచి రెండుసార్లు మొత్తం ఐదుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. 8, 9,12,14,15 లోక్‌సభల్లో ఆయన సభ్యుడిగా సేవలు అందించారు.యూపీఏ 2 ప్రభుత్వంలో మన్మోహన్ సింగ్ కేబినెట్లో ఆయన కేంద్ర జౌళి శాఖా మంత్రిగా పనిచేసి ఆయన చిరకాల కోరిక నెరవేర్చుకున్నారు. కావూరు కాంట్రాక్టర్ నుండి అగ్ర రాజకీయ నాయకుడిగా ఎదిగారు. రాజకీయాల్లోకి రాకముందు ఆయన ఇంజనీర్‌గా పనిచేశారు. ప్రోగ్రెసివ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ద్వారా నిర్మాణ రంగంలో మంచి పేరు గడించారు. ఏలూరు - మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో పదుల సంఖ్యలో వివిధ కులవృత్తి సంఘాలకు కమ్యూనిటీ హాల్స్, భవనాలు, మౌలిక సదుపాయాల కల్పన, మహిళలకు చేతివృత్తుల్లో శిక్షణ ఇప్పించడం, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో బాగా చొరవ తీసుకున్నారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో ఉన్న ఆయన రాష్ట్ర విభజన తర్వాత మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 2014లో బీజేపీలో చేరారు. రాజకీయాల్లో తన అభిప్రాయం కుండబద్దలు కొట్టినట్టు చెప్పే నేతగా పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర విభజన సమయంలో కోస్తాంధ్ర ప్రాంత రాజకీయాలపై ఆయన బలంగా గళం వినిపించారు.

**- ఐదుగురిలో కావూరు ఒక్కడు** -1984లో నాటి సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్టీఆర్ ప్రభంజనంలో తుడిచిపెట్టుకుపోయింది.. కేవలం ఐదుగురు మాత్రమే ఎంపీలుగా గెలిచారు వారిలో కావూరు ఒకరు కావడం విశేషం. నేదురుమిల్లి జనార్దన్‌రెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, కోట్ల విజయ్‌భాస్కర్ రెడ్డి, వైఎస్.రాజశేఖర్ రెడ్డి మిగిలిన నలుగురు నేతలు కావడం విశేషం.

**- 2004 నుంచి ఏలూరు జిల్లాలోకి ఎంట్రీ** -2004 ఎన్నికల వేళ కావూరు ఏలూరు లోక్‌సభకు పోటీ చేయడం ద్వారా ఏలూరు జిల్లా రాజకీయాల్లోకి ప్రవేశించారు. నాడు కేంద్ర సహాయ మంత్రిగా టీడీపీ నుంచి పోటీ చేసిన బోళ్లబుల్లి రామయ్యపై 1.20 లక్షల ఓట్ల భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించారు.

# వంద కుటుంబాల చిరకాల కోరిక నెరవేర్చిన ఎంపీ మహేష్




**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు శివారు సీతాపురం గేటెడ్ కమ్యూనిటీలో నివసిస్తున్న 100 కుటుంబాల చిరకాల కోరికను పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ తక్షణమే పరిష్కరించారు. హై లెవెల్ వాటర్ ట్యాంక్,సంబంధిత ఎలక్ట్రికల్ సర్వీసును వట్లూరు గ్రామ పంచాయతీ స్వాధీన పరుచుకోవడంలో నెలకొన్న నిర్లక్ష్యాన్ని గ్రహించిన పార్లమెంటు సభ్యులు స్వచ్ఛందంగా సంబంధిత ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.ఈ సమస్య పరిష్కారం వలన కమ్యూనిటీ పై ఆర్థిక భారం తగ్గడంతో పాటు,వారందరికీ తాగునీరు, గృహ అవసరాలకు కావలసిన నీరు ఇంతకు మునుపు ఏ విధంగా అయితే లభ్యమయ్యేది అదే విధంగా ఇప్పుడు కూడా లభ్యమవుతుందని కాలనీవాసులు ఆశిస్తున్నారు. ప్రత్యేక శ్రద్ధ, చొరవ కనబరచి యుద్ధ ప్రాతిపాదికన సమస్యను పరిష్కరించిన యువ పార్లమెంటు సభ్యులు మహేష్ కుమార్‌కి స్థానికులు యార్లగడ్డ రామకోటేశ్వరరావు, వెన్నమనేని సాయి సుధ,గాదం పుల్లయ్య నాయుడు,తాంధ్ర శ్రీకాంత్,వసుపులేటి ప్రసాద్,సాలి కిరణ్,గుజ్జు శశాంక వర్మ,కొల్లి వెంకట రమణ,జాద్ వలీ,దామెర శ్రీనివాస్,సంపత్,ఆర్విపి, ఉంగరాల రమేష్,గాదం నాగేశ్వరావు,పెదపాటి శ్రీనివాస్, మత్తే రూపేష్ వర్మ,పోలిమెట్ల సుమంత్, మేడేపూడి వర ప్రసాద్, బసువ రాజు, తదితరులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## స్వర్ణాంధ్ర @ 2047 లక్ష్యంగా అడుగులు

**మొదటిపేజీ తరువాయి**

విధానంతో రూ.4600 కోట్ల భారం ప్రభుత్వంపైనే.. వినియోగదారులకు యూనిట్‌కు 39 పైసల తగ్గింపు.**దివ్యాంగులకు చేయూత:** 'ఇంద్రధనస్సు' పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.

**క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ:** ఈ సమావేశాన్ని రాజమహేంద్రవరం కలెక్టరేట్ నుండి జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ మరియు ఇతర జిల్లా అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ కోసం నిర్దేశించిన 10 సూత్రాలను ప్రతి గ్రామంలోనూ, ప్రతి మండలంలోనూ అమలు చేయాలని, ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని కలెక్టర్లకు సీఎం ఆదేశాలు జారీ చేశారు.

## వంట గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

**- ప్రజలు ఎవ్వరూ ఆందోళన చెందవద్దు : జేసి అభిషేక్ గౌడ్**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేటు జిల్లా జాయింటు కలెక్టరు ఛాంబరు నుండి బుధవారం జిల్లాలో గ్యాసు సిలిండర్ల కొరత లేదని, ప్రజలు ఎవ్వరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గృహ అవసరాలకు,ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు వినియోగించే వంట గ్యాసు సిలిండర్ల కొరత ఏమాత్రం లేదని,ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.జిల్లాలో గ్యాసు సిలిండర్ల సరఫరా,డిమాండు మధ్య సమతుల్యత సక్రమంగా ఉందని,గృహ వినియోగ దారులకు డొమెస్టిక్ గ్యాసు సిలిండర్ల పంపిణీ ఎలాంటి అంతరాయం లేకుండా యధావిధిగా కొనసాగుతోందని తెలిపారు. గ్యాసు ఏజెన్సీలు వద్ద తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ,సంక్షేమ వసతి గృహాలకు అవసరమైన గ్యాసు సిలిండర్ల పంపిణీలో ఎలాంటి జాప్యం జరగడం లేదని అన్నారు. విద్యార్థులకు భోజన సదుపాయంలో ఇబ్బంది రాకుండా గ్యాసు సరఫరాను పౌరసరఫరాలు శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు అవసరాలకు,డిమాండుకు తగినట్లుగానే ఆయిల్ కంపెనీలు నుండి గ్యాసు సరఫరా క్రమం తప్పకుండా జరుగుతోందని అన్నారు.జిల్లాలో గ్యాసు కొరత ఉందంటూ వచ్చే ఎలాంటి వదంతులను,అపోహలను ప్రజలు నమ్మవద్దని, అనవస రంగా భయాందోళనలకు గుర్తి వంట గ్యాస్ చేయవద్దన్నారు. గ్యాసు బుకింగు లేదా డెలివరీకి సంబంధించి వినియోగ దారులకు లేదా వసతి గృహాలు నిర్వాహకులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే,వెంటనే సంబంధిత మండల తహశీల్దారు లేదా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు దృష్టికి తీసుకురావాలని జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## వేసవి వేడి గాలులు, వడదెబ్బల నుంచి జాగ్రత్తలు పాటించాలి



**భీమవరంమేజర్ న్యూస్** :వేసవి కాలంలో వచ్చే వేడి గాలులు, వడదెబ్బల నుంచి ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖాధికారిణి డా. జి. గీతాబాయి సూచించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వేసవి కాలంలో ఆరోగ్య రక్షణ కోసం ప్రజలు పాటించాల్సిన సూచనలను వెల్లడించారు.వేసవిలో బయటకు వెళ్లేటప్పుడు తేలికపాటి, లేత రంగు కాటన్ దుస్తులు ధరించడంతో పాటు తలపై టోపీ లేదా గొడుగు ఉపయోగించాలని సూచించారు.దాహం వేయకపోయినా తరచుగా తగినంత నీరు తాగాలని, బయటకు వెళ్లేటప్పుడు సురక్షితమైన తాగునీరు వెంట తీసుకెళ్లాలని చెప్పారు. అవసరమైతే ఓఆర్ఎస్ ద్రావణం, నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాలు వంటి ద్రవాలు తీసుకోవడం ద్వారా శరీరంలో నీటి శాతం నిల్వ ఉండేలా చూడాలని పేర్కొన్నారు.పుచ్చకాయ, కస్తూరి పుచ్చకాయ, నారింజ, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయ వంటి అధిక నీటి శాతం కలిగిన పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు సూర్యకాంతిలో బయటకు వెళ్లకుండా ఉండాలని, ఆ సమయంలో కఠినమైన శారీరక శ్రమలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక చక్కెర కలిగిన శీతల పానీయాలు తీసుకోవడం వల్ల శరీరంలో నీరు తగ్గే అవకాశం ఉందని వాటిని నివారించాలని చెప్పారు. స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల సహకారంతో అవసరమైన ప్రదేశాల్లో తాగునీటి కుండలు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో డా. గీతాబాయి సూచించారు.

# మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు

- కిశోర బాలికలందరూ హెచ్పీవీ వ్యాక్సిన్ స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలి
- ఊబలంక పిహెచ్సీ వద్ద వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం మేజర్ న్యూస్ :** ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో మహిళల సంరక్షణ కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. బుధవారం ఊబలంక పిహెచ్సి పరిధిలో కిషోర్ బాలికల కోసం ప్రభుత్వం అందిస్తున్న హెచ్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పీహెచ్సీ పరిసరాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న క్యాన్సర్ వంటి మహమ్మారులను ఎదుర్కోవడం కోసం ముందస్తు చర్యల్లో భాగంగా 14 సం.ల వయస్సు నుంచి 15 సం.ల వయస్సు ఉన్న కిశోర బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ వేయడం ద్వారా వారు గర్భాశయ క్యాన్సర్ తోపాటు అనేక క్యాన్సర్‌లకు గురి కాకుండా ఉండాలనే ఆలోచనతో బృహత్తరమైన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని కొనియాడారు. కిశోర బాలికలు అందరికీ ఉచితంగా వ్యాక్సిన్ అందించడం గొప్ప విషయమన్నారు. బయట మార్కెట్లో ఈ వ్యాక్సిన్ ఖరీదు రూ.4 వేల వరకూ ఉంటుందని, మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం మొదలుపెట్టిన ఈ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. అన్ని రంగాల్లో కీలకపాత్ర పోషించే మహిళల ఆరోగ్యాన్ని కాపాడడం ప్రధానమైన అంశంగా భావించి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అనే మహమ్మారిని రూపుమాపాలనే లక్ష్యంతో హెచ్ పి వి ఇంజక్షన్లు స్పెషల్ డ్రైవ్ ద్వారా అందిస్తున్నారన్నారు. ఊబలంక పీహెచ్సీ పరిధిలోనే 350 మందిని గుర్తించి వ్యాక్సిన్ అందించడం జరుగుతుందన్నారు. మహిళలంతా కూడా మరీ ముఖ్యంగా 14 నుంచి 15 వయసు ఉన్న కిశోర బాలికలు తప్పకుండా ఈవ్యాక్సిన్ వేయించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల ఆరోగ్యం కాపాడుకోవాలని తెలిపారు.

# పారిశుధ్య పనులను అదనపు కమిషనర్ సుధాకర్ పరిశీలన



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరంలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కే.టి.సుధాకర్ బుధవారం ఉదయం స్వయంగా పరిశీలించారు. నగరంలోని గైగులపాడు, సర్పవరం జంక్షన్, భానుగుడి సెంటర్ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించి పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, చెత్తను సమయానికి తొలగిస్తూ నగరాన్ని శుభ్రంగా ఉంచాలని పారిశుధ్య కార్మికులకు ఆయన సూచి ంచారు. అనంతరం అదనపు కమిషనర్ కే.టి. సుధాకర్ అన్నమఘాటి సెంటర్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు అందిస్తున్న అల్పాహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం సరైన కొలతలతో, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ అల్పాహారం అందించాలని క్యాంటీన్ సిబ్బందికి సూచించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంతో పాటు నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# పశువుల నీటి తొట్టెల నిర్మాణంపై గ్రామస్తులు ఆగ్రహం



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన పశువుల తొట్టెల నిర్మాణంలో నాణ్యత లోపించి ందని మండల బిజెపి నాయకులు తాము సూరిబాబు ఆరోపించారు. పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలంలోని 19 పంచాయతీలలో పల్లె పండగ 2025-26 కార్యక్రమం కింద ఎన్ఆర్‌జీఎస్ నిధులతో పశువుల కోసం నీటి తొట్టెలను నిర్మించారు. అయితే ఈ తొట్టెలు అసంపూర్తిగా, నాసిరకంగా నిర్మించారని ఆయాగ్రామస్తులు ఆరోపిస్తున్నట్లు సూరిబాబు పేర్కొన్నారు. సరైన పద్ధతిలో నిర్మాణం చేయకుండా నాసిరకంగా నిర్మించడం వల్ల నీరు లీక్ అవుతోందని వెల్లడించారు. మొదటి దశలో ఒక్కొక్క తొట్టికి రూ.33 వేల, రెండో దశలో రూ.38 వేల నిధులు విడుదలైనప్పటికీ కొన్ని తొట్టెలకు కుళాయిలు లేకపోవడం, మరికొన్నింటికి నేమ్‌బోర్డులు లేకపోవడం గమనార్హం. కాంట్రాక్టర్లు లాభాల కోసం మాత్రమే ఈ నిర్మాణాలు చేశారని, పశువుల దాహం తీర్చే ఉద్దేశ్యం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారన్నారు. అధికారులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరించటం వెనుక ఉన్న అంతర్యం ఏమిటో అని బిజెపి నాయకులు తాము సూరిబాబు అగ్రహించారు.తక్షణం విచారణ జరిపి పశువులకు నీటి తొట్టెలకు మంచి నీటి కుళాయి కూడా ఏర్పాటు చేసి పశువులకు త్రాగు నీరు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# జగన్మోహిని కేశవస్వామి హుండీ లెక్కింపు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ & గోపాల స్వామివారి ఆలయం వద్ద హుండీ లెక్కింపు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ & ధర్మకర్తల మండలి సభ్యులు, శ్రీ స్వామివారి సేవకులు, సేవా సమితి సభ్యులు, భక్తులు సమక్షంలో హుండీలు లెక్కింపు 5 నెలల 3 రోజులకు రూ.13,98,512లు ఆదాయం సమకూరింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి, తనిఖీ అధికారి ఈవో బి.నరేంద్ర కుమార్, అర్చకులు, సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు, సేవా సభ్యులు పాల్గొన్నారు.

# ఎలుకల నిర్మూలనకు చర్యలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు ఎలుకల మందు ఉచిత పంపిణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎం.వి. రామారావు కట్టుంగ గ్రామంలో పాల్గొని బ్రోమోడైలాన్ 0.25 సి.బి. ఎలుకల మందును రైతులకి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జె.వి.పట్టాభి రామయ్య, జిల్లా వనరుల కేంద్రం ఏఓ మనోహర్ కృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ మణికంఠ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి టికా




**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట మండలం రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 సంవత్సరాల నిండిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా పంపిణీని కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై హెచ్ పీవీ, టి కా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన బాలికలు ఈ టీకా వేసుకోవడం ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను నివారించవచ్చుని తెలిపారు. ఈ టీకా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా అందిస్తారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం 'స్వస్థ నారి' కార్యక్రమంలో భాగంగా ఈ వ్యాక్సినేషన్ చేపడుతోందని . ఈ టీకా 80 శాతం కంటే ఎక్కువ ప్రభావవంతంగా పనిచేస్తుందని శాస్త్రీయంగా నిరూపితమైంది అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు జీను మణిబాబు, ఆత్మ కమిటీ ఛైర్మన్ పైడిపాల సూరిబాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రేఖ బుల్లి రాజు, రాజపూడి సొసైటీ ఛైర్మన్ ఉప్పలపాటి బుల్లెబ్బు, సర్పంచ్ బూసాల విష్ణు, రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# వెంకన్న ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాలే లక్ష్యం





– 1.35 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు
– శంకుస్థాపలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాలు లక్ష్యంగా పనులు చేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు తగినట్లుగా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు. బుధవారం ఆయన ఆలయం వద్ద జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో దేవస్థానం పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు, దేవస్థాన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.1.25 కోట్లతో నిర్మించనున్న స్టెయిన్ లెస్ స్టీల్ క్యూలైన్లు నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఆలయంలో రూ.10లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ ను ప్రారంభించారు. కరూర్ వైశ్యా బ్యాంకు వారు దేవాలయానికి అందించిన దర్శనం, లడ్డూ టిక్కెట్లను జారీ చేసే టిక్కెట్ మిషన్ ను ప్రారంభించారు. పుష్కర ఘాట్ ను, కోనేరు అభివృద్ధి పనులతో పాటు, వకుళమాత అన్నదాన భవన నిర్మాణ పనులను, ఆలయం వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన గడువు లోపుగా పూర్తి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు శనివారాలు, ఏడు ప్రదక్షిణలు ఏడేడు జన్మల పుణ్యఫలం అంటూ లక్షలాదిగా తరలి వస్తున్న భక్తులకు తగినట్లుగా సౌకర్యాలు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్యూలైన్లు పెంచడానికి క్యూలైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. పార్కింగ్ కేంద్రానికి వెళ్లడానికి రూ.50 లక్షల ఎంజీఎన్ఆర్జీఎస్ నిధులతో రహదారి నిర్మాణం జరిగిందని తెలిపారు. దానికి కొనసాగింపుగా పార్కింగ్ ఏరియా నుంచి ఏటిగట్టు వరకూ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టినట్లు తెలిపారు. వకుళమాత అన్నదాన భవనం త్వరలోనే పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కోనేరు పనులు, రథం షెడ్డు పనులు పూర్తవుతున్నాయని అన్నారు. 8 ఎకరాలు పార్కింగ్ స్థలం శాండ్ ఫిల్లింగ్ పూర్తయిందని, త్వరలోనే గ్రావెల్ ఫిల్లింగ్ చేయనున్నట్లు తెలిపారు. రూ.12 కోట్లతో శ్రీనివాసం పేరుతో 54 రూములు, 4 డార్మెటరీలు నిర్మాణానికి త్వరలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

మరొక డార్మెటరీ నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. టూరిజం శాఖ సహకారంతో 18 టెన్సల్ షెల్టర్స్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రసాద్ స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వ నిధుల కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. శ్రీనివాసం–2 కోసం టిటిడి ని సంప్రదిస్తున్నామని తెలిపారు. లక్ష లీటర్ల వాటర్ ట్యాంకు కోసం హెటిరో సంస్థలు విరాళం అందించడం జరిగిందని, ఆ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని, 2 లక్షల లీటర్ల వాటర్ ట్యాంకు కూడా నిర్మిస్తామని తెలిపారు. రహదారి వెడల్పు, నిర్మాణాల కోసం టెండర్లు పిలిచామని తెలిపారు. దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్, సభ్యులు, అధికారులు అందరికీ స్వామివారి సేవ చేసుకోవడానికి వచ్చిన అవకాశంగా భావించి పనులు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, నాయకులు ముళ్ళపూడి భాస్కరరావు, జుజ్జవరపు హరిబాబు, చిలువూరి సతీష్ రాజు, కమిటీ సభ్యులు ఉన్నారు.

# అక్షరాంధ్ర, ఉల్లాస్‌పై సెర్ప్, డ్వామా సిబ్బందికి శిక్షణ



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండల పరిధిలో గల సెర్ప్ మరియు డ్వామా సిబ్బందికి ఈ నెల 15వ తేదిన నిర్వహించనున్న అక్షరాంధ్ర, ఉల్లాస్ ప్లానెట్ 2025–26 పరీక్షల నిర్వహణ మరియు యాప్ హాజరుపై సెర్ప్ డ్వామా సిబ్బందికి బుధవారం స్వర్ణ గ్రామ మండల అధికారి వై.శ్రీహరి, ఏపిఎం పుప్పాల సూర్యనారాయణల ఆధ్వర్యంలో వయోజన విద్య ఉప సంచాలకులు పసుపులేటి పోశయ్య, గణాంక సహాయకులు సునీల్ ఆనంద్‌బాబు, వయోజన విద్యాశాఖ సూపర్‌వైజర్ శ్యామలరావు ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరిగింది.

# ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానవ ధర్మం

– 'పార్డ్' అధ్యక్షులు వెంకటేష్



గోపాలపురం, మేజర్ న్యూస్ : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని ప్రగతి అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ గోపాలపురం మండల శాఖ అధ్యక్షులు దొడ్డిగర్ల వెంకటేష్ అన్నారు. గోపాలపురంలో ఇటీవల విద్యుదాఘాతానికి గురైె శ్రీనివాసరావు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ కుటుంబాన్ని సంస్థ సభ్యులు బుధవారం సాయంత్రం గోపాలపురం పెద్దగూడెంలో పరామర్శించారు. భార్య మౌనిక ముగ్గురు ఆడపిల్లలను ఓదార్చారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ శ్రీనివాసరావు మృతి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. యజమాని మృతితో కుటుంబ పరిస్థితి ఇబ్బందికరంగా మారిన నేపథ్యంలో సంస్థ తరపున అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. బాధితుని భార్యకు సంస్థ తరుపున పాఠశాల అనంతరం ఏర్పాటు చేసే ట్యూషన్ సెంటర్కు టీచర్‌గా ఇంటికి చేయడం జరుగుతుందన్నారు. అలాగే ముగ్గురు ఆడ పిల్లలకు ఉపకార వేతనాలు అందించనున్నామన్నారు. అలాగే తొందరలో సంస్థ ఆధ్వర్యంలో ఉట్టి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని ఆ శిక్షణ కేంద్రంలో భాగస్వామి చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం తక్షణ సహాయం కింద 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి చింతలపూడి భాస్కరరావు, కోశాధికారి ఎం.కొండలరావు, ఉపాధ్యక్షులు వింజమూరి సుబ్బారావు, సహాయ కార్యదర్శి రేవుల గద్ద రత్న భాస్కర్, చింతలపూడి శ్రీనివాసరావు, పాముల తిరుపతయ్య, సోమిశెట్టి వెంకట్రావు, గుమ్మడి నాగేంద్రబాబు, జేమ్స్, బేతాళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో
# మార్చి 13న లారస్ ల్యాబ్స్ క్యాంపస్ డ్రైవ్



కాకినాడ. మేజర్ న్యూస్ : హైదరాబాదుకు చెందిన అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ సంస్థ లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళా శాలలో క్యాంపస్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు తెలియజేసారు. కేవలం పురుషులకు మాత్రమే నిర్వహించే ఈ ఆఫ్ క్యాంపస్ ఇంటర్వ్యూలలో 2025 విద్యా సంవత్సరంలో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు మరియు 2026 విద్యా సంవత్సరంలో ఫైనలియర్ చదువుతున్న ఎం.ఎస్సీ ఆర్గానిక్,అనలైటికల్, ఇంటిగ్రేటెడ్, జనరల్ కెమిస్ట్రీ విద్యార్థులు అదేవిధంగా ఎం.ఫార్మ్, బి.ఫార్మ్, బి.ఎస్సీ కెమిస్ట్రీ మరియు మెకానికల్, ఎలక్ట్రికల్‌లో డిప్లమో చేస్తున్న విద్యార్థులు ఈ క్యాంపస్ డ్రైవ్‌కు హాజరు కావచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ నియామకాలలో క్యూ సి, పిడి, ఏఆర్ మరియు డి, క్యూఏ ఫార్ములేషన్స్ , మ్యానుఫ్యాక్చరింగ్ ఫార్ములేషన్, మ్యానుఫ్యాక్చరింగ్ ఏ పి ఐ వంటి విభాగాలకు నియామకాలు జరగనున్నాయి. ఎంపికైన అభ్యర్థులకు వారి నైపుణ్యం పై ఆధారపడి వార్షిక వేతనం ఉంటుంది. కావున ఆసక్తి గల ఎం.ఎస్సీ, బి.ఎస్సీ, ఫార్మసీ మరియు ఇతర అర్హత గల విద్యార్థులు ఈ నెల 13వ తేదీన ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో జరిగే క్యాంపస్ డ్రైవ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని డాక్టర్ నాయుడు సూచించారు. మరిన్ని వివరముల కొరకు ప్లేస్మెంట్ ఆఫీసర్ సాయి కిషోర్‌ని సంప్రదించ వలసినదిగా తెలియజేయుచున్నాము ఫోన్ నెంబర్ 6309126669

# గాలికుంటు వ్యాధి గోడపత్రిక ఆవిష్కరణ



పెద్దాపురం, మేజర్ న్యూస్ : బుధవారం పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో పశు సంవర్థక శాఖ డైరెక్టర్ డా.వడ్డి శ్రీధర్ కాకినాడ డివిజన్ డిప్యూటి డైరెక్టర్ డా.డి.బి.ఆర్.అంబేద్కర్, పెద్దాపురం అసిస్టెంట్ డైరెక్టర్ డా.తుమ్మల రామస్వామిల ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధికి సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దాపురం, కిర్లంపూడి మండలాలకు చెందిన వెటర్నరి అసిస్టెంట్ సర్జన్‌లు డా.గంగాభవాని, డా.మస్తాన్ బీ, డా.రాకేష్, డా.నయీమ్, యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్‌లు, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

# గర్భాశయ కేన్సర్ రాకుండా హెచ్‌పివి వ్యాక్సిన్



రాజవొమ్మంగి,మేజర్ న్యూస్ : గర్భాశయ కేన్సర్ రాకుండా 14 సం. నిండిన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం స్థానిక పిహె చ్సిలో ప్రారంభించారు. ఎంపీపీ, హాస్పిటల్ చైర్మన్ గోము వెంకట లక్ష్మి అధ్యక్షతన డా.సుష్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఒక వ్యాక్సిన్‌తో గర్భాశయ కేన్సర్ రాదని డా.సుష్మ వెళ్ళడించారు. రాజవొమ్మంగి పి.హెచ్.సి పరిధిలో 183 మంది బాలికలకు ఈ వ్యాక్సిన్‌ను మూడు నెలలు లోపు వేయడం జరుగుతుందని డా. సుష్మ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, డా. సుష్మ, ఏపీఐఐసి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, పి.హెచ్.ఎన్. వెంకటరత్నం, హెచ్. వి. అప్పలనర్స, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# నేడు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాక

– రాజమహేంద్రవరంలో ఫిర్యాదులు స్వీకారం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఈ నెల 12వ తేదీన రాజమండ్రి వస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని బాధిత మహిళలు నుంచి రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి అతిథి గృహంలో 'జన్ సున్వాయి' స్పెషల్ డ్రైవ్‌లో ఫిర్యాదులు స్వీకరించనున్నారు. మహిళల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జన్ సున్వాయి' స్పెషల్ డ్రైవ్ లో భాగంగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఈ నెల 12వ తేదీ (గురువారం) రాజమహేంద్రవరం నగరానికి రానున్నారని పోలవరం (రంపచోడవరం) జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కె.ఉమా ఒక ప్రకటనలో తెలిపారు.

మార్చి 12వ తేదీ ఉదయం రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి అతిథి గృహంకు చేరుకుని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని (తూర్పు గోదావరి, కాకినాడ, డా. బి.ఆర్. అంబేద్కర్, పోలవరం (రంపచోడవరం) జిల్లాలకు చెందిన బాధిత మహిళల సమస్యలను స్వయంగా తెలుసుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ & బి అతిథి గృహంలో నూతనంగా ఏర్పాటు చేసిన సమావేశ మందిరంలో మహిళల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. గృహహింస, వేధింపులు, ఇతర అన్యాయాలకు గురైన మహిళలు "జన్ సున్వాయి" స్పెషల్ డ్రైవ్‌లో వారి ఫిర్యాదులను సమర్పించవచ్చని ఆమె తెలిపారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసి మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ ఆధ్వర్యంలో సత్వర చర్యలు తీసుకుని వేగవంతంగా పరిష్కారం కల్పించే చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. కాబట్టి ఈ అవకాశాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని బాధిత మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా యంత్రాంగం, లీగల్ సెల్, పోలీస్ శాఖ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పోలవరం జిల్లా పరిధిలోని బాధిత మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు.

# అంగన్వాడి, ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే




జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రాథమిక పాఠశాల అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. జ్యోతుల నెహ్రూ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉంటుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సున్నితంగా హెచ్చరించారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులను ఎక్కువ శాతం ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకునే విధంగా ర్యాలీలు చేపట్టి తల్లిదండ్రులలో చైతన్యం తీసుకురావాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి అవసరమైతే నేను కూడా ఇంటింటికి తిరుగుతానని ఆయన ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా ఫ్యాన్లు, పాఠశాలలకు రంగులు, మైనర్ రిపేర్పు చేయించడం జరుగుతుందని, విద్యార్థులకు ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధిచేసిన మంచినీళ్లు అందిస్తామని ఆయన తెలియజేశారు.

# చిత్రలేఖన పోటీల్లో జిల్లా పరిషత్ విద్యార్థులు ప్రతిభ

– ఏడుగురు బంగారు పథకాలు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** విజయవాడలో ఫిబ్రవరి 28న నిర్వహించిన 13 వ జాతీయ యూత్ మరియు చిల్డ్రన్స్ ఆర్ట్ కాంపిటీషన్ లో రాజవొమ్మంగి జిల్లా పరిషత్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విజయవాడ డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ అకాడమీ ఫైన్ ఆర్ట్స్ ఫౌండేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పి.రమేష్ నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో పోలవరం జిల్లా రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 50 మంది విద్యార్థులు పాల్గొనగా ఏడుగురు విద్యార్ధులు బంగారు పతకాలు సాధించగా ఐదుగురు వెండి పతకాలు గెలుపొందారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుని ఎ.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల పిఎంసి ఛైర్మన్ మరిచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ అకాడమీ వారు విద్యార్థులకు చిత్రలేఖనం లో మంచి ప్రతిభ చూపే విధంగా తీర్చిదిద్దిన చిత్రలేఖన ఉపాధ్యాయుడు మిరియాల కొండబాబు నకు బాల ప్రోత్సాహక అవార్డ్ 2026 ను ప్రదానం చేసింది. ఈ అవార్డ్ ను హెచ్ ఎం మరియు పేరెంట్ కమిటీ చైర్మన్ ఉపాధ్యాయునకు అందించి మన పాఠశాల
చిత్రలేఖనంలో జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా అభినందనీయమన్నారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థుల్లో 1 ఎస్ రామప్రసన్న సి హెచ్ పూర్ణకాష్,ఎం వెంకట సూర్య, కె సంతోష్, బి సాయి చంద్రిక, ఎల్ ఇందు సత్య దుర్గ. కె భువనేశ్వరి ఉన్నారు. వెండి పతకాలు గెలుపొందిన వారిలో వి వి వి ఎస్ గౌతమ్ కుమార్,పి గణకార్తికేయ, బి జీవన్ దుర్గేంద్ర , టి పవనజ, కె స్నేహ ఉన్నారు. 38 మంది సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డ్‌లను గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ఉపాధ్యాయులు సి హెచ్ శివకృష్ణ, , మిరియాల కొండబాబు, ఉదయ్ కుమార్, పాల్ బాబు, సింహాచలం,, ఎ అప్పారావు, విఘ్నేశ్వర రావు , కె సత్యబాబు, శాంతి ప్రియ, జయలక్ష్మి, ప్రశాంతి, పుష్పలత, రేష్మా, పార్వతీ దేవి, ఎస్ కె సెహ్నాజ్ అహ్మదీ ,ఎం శాంతిబాబు , ఎల్. కొండబాబు, తదితరులు గ్రామ పెద్దలు ,తల్లి దండ్రులు విద్యార్థులకు ,చిత్రలేఖన ఉపాధ్యాయునకు అభినందనలు తెలియజేశారు.

## గర్భాశయ క్యాన్సర్ నిర్మూలనకు ప్రభుత్వం కృషి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** గర్భాశయ క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళిక చేపట్టినట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్ తెలిపారు. బుధవారం సామర్లకోట సాయి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్లో హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి కూటమి నేతలు ప్రారంభించారు. డాక్టర్ విజయ పావని, డాక్టర్ రమ్య ప్రభ తదితరులు పాఠశాల విద్యార్థులకు వ్యాక్సిన్ ప్రక్రియ నిర్వహించారు. పాఠశాల స్థాయి నుండే వ్యాక్సిన్ అందిస్తున్నట్లు వైద్యులు వివరించారు. కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర, బలుసు వాసు,వాడపర్తి వీరభద్రరావు,మహంకాళి గణేష్,అరుణ వంశీ, పడాల వీరబాబు, గోల్టి సత్యనారాయణ, కాపవరపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం




సామర్లకోట, మేజర్ న్యూస్ : బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా సంభవించిన అగ్ని ప్రమాదంతో ఒక ఇల్లు దగ్ధమైంది. స్థానిక పాత రెవెన్యూ కార్యాలయ ప్రాంతంలో ఒక పూరిల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. వడ్డాది లక్ష్మి నాగమణి అనే మహిళకు చెందిన ఇల్లు అగ్రి ప్రమాదానికి గురికావడం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపు చేయటంతో పెద్ద ప్రమాదం తప్పింది. బాధితురాలు లక్ష్మి నాగమణి బోరున విలపిస్తుంది. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బాధితురాలు నాగమణి కోరుతోంది. ప్రమాద ఘటనకు సంబంధించి స్థానిక వీఆర్వో వచ్చి వివరాలను నమోదు చేసుకోగా, పోలీసులు ప్రమాద సంఘటన సంబంధించి వివరాలు తీసుకొన్నారు

# అడ్డగోలు నిర్మాణాలపై నోటీసులు

– సూర్య కథనానికి స్పందన





**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** అనుమతులకు విరుద్ధంగా జగ్గంపేటలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝులిపించారు. అక్రమ కట్టడాలపై జగ్గంపేటలో పక్కా కమర్షియల్ శీర్షికతో సూర్య దిన పత్రికలో బుధవారం ప్రచురితమైన కథనంపై యంత్రాంగం స్పందించింది. స్థానిక పద్మనాభ నగర్‌లో ఇంటి నిర్మాణానికి అనుమతులు పొంది 9 కమర్షియల్ షాపులను నిర్మిస్తున్న మద్దాల సీత, మద్దాల వెంకటేష్ ప్లాన్లకు విరుద్ధంగా కమర్షియల్ షాపులు నిర్మాణాలు చేపడుతున్నారు. తక్షణం షాప్ నిర్మాణాలను నిలుపుదల చేయాలని, నిర్మించే కమర్షియల్ షాపులకు కాకినాడ కూడా అనుమతులు పొందాలని, అనుమతులు పొందకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు నోటిసులు జారీ చేశారు. ఈ నోటీసు అందిన 48 గంటలలో వివరణ ఇవ్వాలని నోటీసు పంపించినట్లు పంచాయతీ కార్యదర్శి జి.శివ తెలిపారు. గోకవరం రూట్‌లో ఉన్న మరో భవనానికి నోటీసు సిద్ధం చేసినట్లు తెలిపారు.

# భార్యను హతమార్చిన భర్త

**– ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం మండలం దబ్బవలస గ్రామంలో ఈనెల ఏడో తేదీన ఒక గిరిజన వివాహిత మహిళ హత్యకు గురైంది. ఈ సంఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. భర్త బోదులూరు అబ్బాయిరెడ్డి అతని భార్య లక్ష్మిని కిరాతకంగా ఊరి చివర జీడిమామిడి తోటలో కొట్టి చంపినట్టు ప్రాథమికంగా అందిన సమాచారం బట్టి తెలిసింది. సంఘటనా ప్రాంతాన్ని రంపచోడవరం సి ఐ ఎన్. సన్యాసి నాయుడు, ఎస్ఐ వెంకటరావు పరిశీలించారు. భార్యాభర్తల తగాదాల నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు తెలుస్తుందని, విచారణ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని సిఐ సన్యాసి నాయుడు పేర్కొన్నారు. ఈ హత్య జరిగి ఐదు రోజులు అయినందున మహిళ మృతదేహం పాడైందని, గురువారం పోస్టుమార్టం నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు రంపచోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యను ఖండించిన భారత ఆదివాసి పార్టీ

భారత ఆదివాసి పార్టీ బృందం ఆదివాసీ మహిళ మృతి చెందిన ప్రదేశాన్ని బుధవారం సందర్శించారు. భారత ఆదివాసీ పార్టీ నాయకులు, జిల్లా ఇంచార్జ్ మద్దేటి అంజిరెడ్డి మాట్లాడుతూ అధ్వాన స్థితిలో పురుగులు పట్టి మృతదేహం ఉందన్నారు. కిరాతకమైన పద్ధతిలో మహిళలను హతమార్చడం తగదన్నారు. ఏదైనా ఉంటే పెద్దల సమక్షంలో లేకపోతే పోలీసులు సమక్షంలో సమస్య పరిష్కరించుకోవాలన్నారు. మృతురాలు లక్ష్మికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, అతి చిన్న వయసులో తల్లి దూరమైతే ఆ పిల్లల బాధ నరకమని, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నష్టపోయిన పిల్లలకు న్యాయం చేయాలని అధికారులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. రంపచోడవరం పార్టీ డివిజన్ అధ్యక్షులు పండా కృష్ణమూర్తి దొర, జిల్లా యూత్ కన్వీనర్ నెక్కల శ్రీనివాసరావు, మారేడుమిల్లి మండలం అధ్యక్షుడు చెదల వెంకటరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులు నియామకం

**– ప్రభుత్వ జీవో విడుదల**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు నియామకంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం 1994 లోని సెక్షన్ 143 ప్రకారం రాష్ట్రంలో జిల్లా కలెక్టర్లకు అధికారాలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. పంచాయత్ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి విభాగం ద్వారా జివో 47 ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశి భూషణ్ కుమార్ పేరుమీద బుధవారం విడుదల చేసారు.

సెక్షన్ 14(3) నిబంధనలు ప్రకారం ఎన్నికైన చాలా గ్రామ పంచాయతీల సభ్యులు, సర్పంచ్‌ల పదవీ కాలం 02.04.2026 నాటికి ముగుస్తుంది. కొన్ని గ్రామ పంచాయతీల సభ్యులు, సర్పంచ్‌ల పదవీ కాలం 02.04.2026 తర్వాత ముగుస్తుంది. ప్రభుత్వం అధికారం ఇచ్చిన తర్వాత, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం 1994 లోని సెక్షన్ 143 లోని సబ్ సెక్షన్ (3) ప్రకారం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారి, పర్సన్–ఇన్–ఛార్జ్ లేదా పర్సన్–ఇన్–ఛార్జ్ కమిటీని నియమించడానికి అధికారం కలిగి ఉన్నారు. గ్రామ పంచాయతీ సభ్యులు, సర్పంచ్ ఎన్నికైన వారు పదవీ బాధ్యతలు స్వీకరించే వరకు గ్రామ పంచాయతీ అధికారాలను వినియోగించడానికి, విధులను నిర్వర్తించడానికి ప్రత్యేక అధికారులను నియమిస్తారు. కాబట్టి ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం 1994లోని సెక్షన్ 143లోని సబ్–సెక్షన్ ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ ప్రభుత్వం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు తహశీల్దార్/మండల్ పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్/మండల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్/డిప్యూటీ ఎంపిడిఓ నుండి లేక అంతకంటే ఎక్కువ హోదా కలిగిన అధికారిని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమించడానికి అధికారం ఇచ్చారు. గ్రామ పంచాయతీల పదవీకాలం 02.04.2026న ముగియనుంది. ఇలా నియమించబడిన ప్రత్యేక అధికారులు ఎన్నికైన సభ్యులు, గ్రామ పంచాయతీల సర్పంచుల పదవీ కాలం ముగిసిన వెంటనే కార్యాలయం బాధ్యతలు స్వీకరిస్తారు. ఇంకా, కొన్ని గ్రామ పంచాయతీల సభ్యులు, సర్పంచుల పదవీ కాలం 02.04.2026 తర్వాత ముగియనున్నందున, సంబంధిత కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ప్రత్యేక అధికారులను వారి అధికార పరిధిలోని గ్రామ పంచాయతీలకు నియమిస్తారు.

## మున్సిపల్ బకాయిలు చెల్లించండి : కమిషనర్ వెంకటరామిరెడ్డి


**నరసాపురం,మేజర్ న్యూస్ :** మున్సిపాలిటీకి 2025– 26 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఇంటి పన్నులు, ఖాళీ స్థలాలు, పైప్ కనెక్షన్ పన్నులను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి పట్టణ ప్రజలను కోరారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేయాలంటే వినియోగదారుల పన్నులు కట్టాలని ఇప్పటికే బకాయి ఉన్న అందరూ కూడా పన్నులు చెల్లించాలని కోరారు. లేనియెడల వ్యక్తిగత పైప్ కనెక్షన్లు తీసివేయబడతాయని పరిస్థితిని అర్థం చేసుకుని ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

# ప్రభుత్వ పధకాల అమలును పరిశీలించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ గౌరవ సభ్యురాలు గంజిమాల దేవి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ గౌరవ సభ్యురాలు గంజిమాల దేవి బుధవారం రాజమహేంద్రవరం నగరంలో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల అమలును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని సుబ్బారావు పేటలో ఉన్న మూడు ఐసీడీఎస్ కేంద్రాలు, నెహ్రూ నగర్‌లోని ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. పర్యటనలో భాగంగా పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును, అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు. పిల్లలకు పోషక విలువలు కలిగిన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని శుభ్రంగా మరియు రుచికరంగా వండి అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. వసతి గృహాల్లో ఉండే పిల్లల పట్ల వ్యక్తిగత బాధ్యతతో వ్యవహరించి వారికి నాణ్యమైన ఆహారం అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు, వసతి గృహాల్లో పిల్లలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత వంటి అంశాలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో వంట చేసే వారు కూడా బాధ్యత వహించాలని, మండల విద్యా అధికారి కూడా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా అమలు చేయడం పై బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి వెంట ఏఎస్‌వో నాగాంజనేయులు, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం. సందీప్, ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమ, పౌర సరఫరాల, పాఠశాల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కేంద్రమంత్రి కావూరి మృతికి బీజేపీ నేత గారపాటి తీవ్ర విచారం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** మాజీ కేంద్రమంత్రి, భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత కావూరి సాంబశివరావు అనారోగ్యంతో కన్నుమూశారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి పేర్కొన్నారు. ఐదు సార్లు ఎంపీగా, కేంద్రమంత్రిగా కావూరి తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేశారని ఆయన కొనియాడారు. రాజకీయాల్లో కావూరికి ఉన్న అపారమైన అనుభవం,ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత వెలకట్టలేనివని గారపాటి చౌదరి అన్నారు. ముఖ్యంగా ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధిలో కావూరి కీలక పాత్ర పోషించారని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్లమెంటు లోపల, బయట నిరంతరం గళం వినిపించిన నికార్సైన నాయకుడని ఆయన గుర్తుచేసుకున్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, అభివృద్ధికి బాటలు వేసిన గొప్ప వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. కావూరి సాంబశివరావు మరణం బీజేపీకి,తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరని లోటు అని గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, శోకతప్త హృదయంతో ఉన్న వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## కేంద్ర మాజీ మంత్రి కావూరి మృతికి టిడిపి జిల్లా అధ్యక్షులు బడేటి సంతాపం

**ఏలూరు,మేజర్ న్యూస్ :** కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు మృతి పట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్యే బడేటి చంటి సంతాపం తెలిపారు. ఐదుసార్లు ఎంపీగా పనిచేసిన కావూరి సాంబశివరావు రెండుసార్లు ఏలూరు ఎంపీగా విజయం సాధించి కేంద్ర మంత్రిగా కూడా పనిచేసి విశేష సేవలు అందించారని ఆయన పేర్కొన్నారు. ఆయన మృతి తనకు దిగ్భ్రాంతి కలిగించిందని టిడిపి అధ్యక్షులు బడేటి చంటి ఒక ప్రకటనలో పేర్కొంటూ కావూరి సాంబశివరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## లైన్మెన్‌గా ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలకు సన్మానం



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** విద్యుత్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన లైన్మెన్ లకు ఉత్తమ సేవా పురస్కారాలను ప్రభుత్వం అందించింది.లైన్‌మ్యాన్ దివస్ సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం పొందిన లైన్మెన్లను ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జంగారెడ్డిగూడెం డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం జీలుగుమిల్లి సబ్ డివిజన్ కార్యాలయం వద్ద సన్మానించారు. కుక్కునూరు, వేలేరుపాడు సెక్షన్లలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం కృషి చేసిన లైన్‌మన్ తగరం వెంకటరత్నం, జూనియర్ లైన్‌మన్లు కె.సంకురు, కె.అసురామ్, కె.ముఖేష్, కె.రామచంద్రరావులను డివిజన్ అధ్యక్షుడు మడకం రాంబాబు, కార్యదర్శి సిహెచ్ రాజు,సహాయ కార్యదర్శి వై.వి.భాస్కర్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు వి.జగన్ మోహన్ రావు సన్మానించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వహించే సమయంలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు.

# ఏజెన్సీ ఉద్యోగ నియామకాల చట్ట రూపకల్పన కొరకు కృషి చేయాలి

**- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌కి వినతిపత్రం అందజేసిన ఏటిఏ బృందం**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఎటపాక మండలానికి విచ్చేసిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జి రెడ్డికి ఏటిఏ నాయకులు ముందుగా శాలువాతో సన్మానించి ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఉద్యోగ సమస్యలపైన రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనితి శేఖర్ మరియు ఏటిఏ ఎటపాక బృందం ఆధ్వర్యంలో అనేక సమస్యలతో కూడిన వినతి పత్రం ఆయనకు అందజేయడం జరిగింది. వినతి పత్రంలో పొందుపరిచిన అంశాలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డికి వివరిస్తూ ఏజెన్సీ ప్రాంతంలో ఫిఫ్త్ షెడ్యూల్డ్‌కు అనుగుణంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఏజెన్సీ ప్రాంత వాసులకే చెందేలా కృషి చేయాలని ఉద్యోగ నియామకాల చట్టం రూపకల్పన కొరకు కృషి చేయాలని వారిని కోరడం జరిగింది.

అంతేకాకుండా మెగా డిఎస్సి-2025 ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయ నియామకాలు పొందిన గిరిజనేతర ఉపాధ్యాయులను మైదాన ప్రాంతంలోకి బదిలీ చేయించే విధంగా ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి తద్వారా ఏజెన్సీ నిరుద్యోగులకు తగు న్యాయం చేయాలని వారికి వివరించడం జరిగింది. ప్రతి గిరిజన సంక్షేమ పాఠశాలలో ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేసి విద్యార్థుల ఆరోగ్య సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని వారిని కోరడం జరిగింది.ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కణితి రామకృష్ణ, జిల్లా నాయకులు మానే ప్రవీణ్, మండల గౌరవ అధ్యక్షులు సోడె దారోగి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాక రాజు, అపక నాగేశ్వరరావు, పండ కిరణ్, పోడియం రాకేష్, మడకం రాంబాబు, పాయల తులసి, గొంది లక్ష్మి, పి.పుల్లమ్మ, కుర్సం కవిత, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ సెమినార్‌లో ప్రతిభ చూపిన మున్సిపల్ స్కూల్ విద్యార్థి




సామర్లకోట, మేజర్ న్యూస్ : జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో స్థానిక పిఎం శ్రీ బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హై స్కూల్ అయోధ్యరామపురం విద్యార్థిని అక్కిన జ్ఞానీశ్వరి అత్యుత్తమ ప్రతిభ చూపి జిల్లా ద్వితీయస్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయిరామ కృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఉదయం జిల్లాస్థాయి సైన్స్ పోటీలు ఏపీఎస్పీ స్కూల్ కాకినాడలో నిర్వహించారు. సైన్స్ సెమినార్‌లో చక్కటి ప్రతిభ చూపిన పాఠశాల ఏడవ తరగతి విద్యార్థిని ఏ జ్ఞానీశ్వరి ను జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్, సైన్స్ అధికారి వినీల్ తదితరులు జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ ఎన్ హరనాథ్, ఏ చక్రధర్, యాదిద్య తదితరులు పాల్గొన్నారు

# గర్భాశయ కేన్సర్ రాకుండా హెచ్ పి వి వ్యాక్సిన్



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : గర్భాశయ కేన్సర్ రాకుండా 14 సం. నిండిన బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం స్థానిక పిహెచ్సిలో ప్రారంభించారు. ఎంపీపీ, హాస్పిటల్ చైర్మన్ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన డా.సుష్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఒక వ్యాక్సిన్‌తో గర్భాశయ కేన్సర్ రాదని డా. సుష్మ వెళ్ళడించారు. రాజవొమ్మంగి పి. హెచ్. సి పరిధిలో 183 మంది బాలికలకుఈ వ్యాక్సిన్ను మూడు నెలలు లోపు వేయడం జరుగుతుందని డా. సుష్మ అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, డా. సుష్మ, ఏపీఐ ఐ. సి. డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, పి. హెచ్. ఎన్. వెంకటరత్నం, హెచ్. వి. అప్పలనర్స, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటి నిర్మాణాల అనుమతులతో నిర్మిస్తున్న షాపులను వెంటనే నిలిపివేయాలి

**- జగ్గంపేట పంచాయతీ సెక్రెటరీపై చర్యలు తీసుకోవాలి**
**- ఏపీఆర్‌సిఎస్ డిమాండ్**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేటలో అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణ అనుమతులతో నిర్మిస్తున్న షాపులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో చంద్ర శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి కే.సతీష్ మాట్లాడుతూ రాజకీయ, అండదండలతో పంచాయతీ కార్యదర్శి కేవలం పంచాయతీకి చెందవలసిన పన్నులను ఎగొట్టడానికి ఇంటి నిర్మాణం కొరకు తీసుకున్న అనుమతులతో షాపులు నిర్మిస్తున్నారని ఆ షాపులను తక్షణమే నిలిపేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధానంగా పంచాయితీలను అభివృద్ధి పదంలో నడిపిస్తున్నామని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఇలాంటి విషయంలో నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. 70 శాతం పూర్తి అయిపోయిన షాపులకు ఇప్పటివరకు స్పందించలేదంటే ఎంతవరకు పర్యవేక్షణ ఉందో దీన్ని బట్టి అర్థమవుతుందని ఆయన తెలిపారు. పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే పన్నులు ఎగ్గోట్టకూడదని పన్నులు కడితే అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. కానీ ఇక్కడ లంచాలకు అలవాటుపడి అభివృద్ధిని, బాధ్యతలను గాలికి వదిలేస్తున్నారని ఆయన విమర్శించారు. తక్షణమే ఈ షాపులపై విచారణ చేపట్టి నిలిపేయాలని, అలాగే పంచాయతీ కార్యదర్శి పై విచారణ చేపట్టి,చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.లేనియెడల జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు డాన్ శ్రీను, రవణ, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాంధ్ర లెర్నర్స్ పరీక్షపై సమీక్ష



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన అడ్డతీగలలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల ప్రత్యేక అధికారి రుక్మాంగయ్య ఆధ్వర్యంలో అక్షరాంధ్ర లెర్నర్స్ పరీక్ష పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 15వ తేదీన మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఫైనల్ పరీక్షకు అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు మొత్తం మండలంలో 7084 లెర్నర్స్ ఉండగా వారిని పరీక్ష కేంద్రాలకు తరలించే విధానము ఇన్విజిలేషన్ ఏర్పాట్లు పరీక్ష అనంతరం మూల్యాంకనం చేయుట వచ్చిన మార్కులను ఆన్లైన్లో ఎంటర్ చేసే విధానాలపై ప్రత్యేక అధికారి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్‌తో పాటు మండల విద్యాశాఖ అధికారి రమేష్ ఏపీవో చిరంజీవి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి వెల్ఫేర్ అసిస్టెంట్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అక్షరాంధ్ర లెర్నర్స్ పరీక్షకు టీచర్స్ అందుబాటులో ఉండాలి

అడ్డతీగల, మేజర్ న్యూస్ : ఈ నెల 15వ తేదీ ఆదివారం నాడు మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో జరగనున్న అక్షరాంధ్ర లెర్నర్స్ ఫైనల్ పరీక్షకు మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులంతా అందుబాటులో ఉండి తప్పనిసరిగా హాజరు కావాలని మండల విద్యాశాఖ అధికారి-1 కే రమేష్ సూచించారు. ఉల్లాస కార్యక్రమంలో భాగంగా మొత్తం 721 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహణకు ఏర్పాటు చేశామన్నారు. నిరక్షరాస్యులకు ఎక్కడైతే క్లాసులు నిర్వహించామో అక్కడే పరీక్షకు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 15వ తేదీ ఆదివారం అయినా ఉపాధ్యాయులంతా విధిగా హాజరు కావాలని సూచించారు. ఏ ఒక్కరికి మినహాయింపు లేదని పేర్కొన్నారు.

## అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే నల్లమిల్లి**
**- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**



**అనపర్తి,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమము ధ్యేయంగా పనిచేస్తుందని, కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ దూసుకుపోతుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అందులో భాగంగా 3 కోట్ల 81 లక్షల రూపాయలతో వ్యయంతో చేయబోయే రాజానగరం - పెదపర్తి రేవు ఆర్ అండ్ బి రోడ్‌లో పి.రామచంద్రపురం నుండి అనపర్తి వివేకానంద విగ్రహం వరకు ఆర్ అండ్ బి రోడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. 6 లక్షల రూపాయలతో వ్యయంతో పీ రామచంద్రపురం గ్రామంలో నిర్మించిన నల్లమిల్లి మూలారెడ్డి రజక కమ్యూనిటీ హాల్ ను ఎమ్మెల్యే ప్రారంభిం చారు. 35 లక్షల రూపాయలతో పీ.రామచంద్రపురంలో నిర్మించిన 4 సీసీ రోడ్లను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని అణిచివేసిందని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోనికి దించిందని, ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.